


రేపు శ్రీశ్రీ జయంతి సభ

ప్రజాశక్తి-తిరుపతి సిటి

సాహితీ స్రవంతి-వేమన విజ్ఞాన కేంద్రం సంయుక్త ఆధ్వర్యంలో శ్రీశ్రీ జయంతి వేడుకను ఈ నెల 30న నిర్వహించనున్నట్లు వేమన విజ్ఞాన కేంద్రం కార్యదర్శి ఎం.నాగార్జున శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక యశోదనగర్‌లోని వేమన విజ్ఞాన కేంద్రంలో సాయంత్రం ఐదు గంటలకు జరిగే సభకు అధ్యక్షులుగా ఎస్‌వియు ఓఆర్‌ఐ పిసి.వెంకటేశ్వర్లు, ఉపన్యాసకులుగా రాయలసీమ పోరాట సమితి అధ్యక్షులు భూమన్, సీనియర్ జర్నలిస్టు రాఘవశర్మ, మానసవికాసవేదిక కన్వీనర్ సాకం నాగరాజు, తిరుపతి బాలోత్సవం గౌరవాధ్యక్షులు టెంకాయల దామోదరం, ప్రముఖ రచయిత డాక్టరు విఆర్.రాసాని, ఆఫీసర్ క్లబ్ అధ్యక్షులు డాక్టరు టి.రామచంద్రారెడ్డి, సాహితీ స్రవంతి కన్వీనర్ ఓవి రమణ హాజరవుతారని తెలిపారు.

శ్రీకాళహస్తి నియోజకవర్గం అంతా ఒక్క బోరే..

'బోరు'మన్న.. 'జలకళ'



మూడేళ్లుగా అన్నదాత నిరీక్షణ
నిధుల్లేక పక్కన పెట్టిన సర్కార్
నియోజకవర్గంలో వందకే పరిమితం
కలవరపెడుతున్న తాజా నిబంధనలు

ప్రజాశక్తి - శ్రీకాళహస్తి

రైతు సంక్షేమం కోసం పథకాలు ప్రవేశపెడుతున్నామని ఆర్భాటం చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం అంతలోనే వారి ఆశలను అడియాసలు చేస్తోంది. ఉచితంగా బోర్లు వేస్తామని చెప్పిన పాలకులే వ్యయం భరించలేక అన్నదాతల పైనే ఆర్థికభారం మోపుతున్నారు. అందుకు నిదర్శనమే వైఎస్సార్ జలకళ పథకం. సకాలంలో సాగును ప్రోత్సహించే క్రమంలో మూడేళ్ల క్రితం ఈ పథకాన్ని ప్రవేశపెట్టిన విషయం తెలిసిందే. చిన్న, సన్న కారు రైతులకు చెందిన నీటి సౌకర్యం లేని మెట్ట భూముల్లో ఉచితంగా బోర్లు సమకూర్చడమే దీని ఉద్దేశం. పథకం అమలుకు సంబంధించి ప్రభుత్వం తాజాగా తీసుకున్న నిర్ణయం లబ్ధిదారులను కలవర పరుస్తోంది.

సాగునీటి ప్రాజెక్టులు లేని కరువు జిల్లాలో ఇబ్బందులను అధిగమించాలనే లక్ష్యంతో ప్రభుత్వం 2020, సెప్టెంబర్‌లో అర్హులైన రైతులకు ఉచితంగా బోర్లు వేయడం ద్వారా చేయూత అందివ్వాలని నిర్ణయించింది. ఉచితంగా బోరు వేసి, మోటారుతో పాటు విద్యుత్ సౌకర్యం కల్పించనుండడంతో రైతులు ఈ పథకం కోసం ఆసక్తి చూపారు. రెండున్నర ఎకరాల విస్తీర్ణం భూమి ఉన్న రైతులు, తక్కువ విస్తీర్ణం ఉన్న రైతులు గ్రూపుగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. నిబంధనలకు లోబడి ఎందరు చేసుకున్నా పథకం లబ్ధి పొందేందుకు అర్హులేనని స్పష్టం చేశారు. జియాలజిస్ట్ స్వీయ పరిశీలన అనంతరం నీరు పడే ప్రాంతాలను గుర్తించి ఎంత లోతుకైనా బోరు వేసి రైతులకు ఉచితంగా అప్పగించాలి. అయితే ప్రభుత్వంతో కుదుర్చుకున్న ఒప్పందం ధరల ప్రకారం కాంట్రాక్టర్లకు గిట్టుబాటు కావడం లేదన్న కారణంతో జిల్లాలో బోర్లు వేసే ప్రక్రియ మందగించింది. శ్రీకాళహస్తి, సత్యవేడు ప్రాంతాల్లో అడుగుకు రూ.110 బిడ్ వేసిన కాంట్రాక్టర్లు అది కాస్త గిట్టుబాటు కాకపోవడంతో రూ.140 డిమాండ్ చేస్తున్నట్లు సమాచారం. ఒకవేళ బోర్లు వేసినా ప్రభుత్వం నుంచి సకాలంలో బిల్లులు రాకపోవడంతో ముందుకు రాని పరిస్థితి.

వేసిన బోర్లు కేవలం 200 మాత్రమే..

తిరుపతి జిల్లా వ్యాప్తంగా 6952 మంది రైతులు వ్యవసాయ బోర్లకు జలకళ కింద దరఖాస్తు చేసుకున్నారు. వీటిలో 5618 జియాలజిస్ట్ పరిశీలనకు వెళ్లాయి. అందులో 1468కి మాత్రమే జియాలాజిస్ట్ పూర్తి అయినది. వాటిల్లో 969 కి మాత్రమే నీటి వసతి ఉండే అవకాశం ఉందని గుర్తించారు. ఆ 969 దరఖాస్తులను కాంట్రాక్టర్లకు పంపగా ఇప్పటి వరకు జిల్లా వ్యాప్తంగా కేవలం రెండు వందల బోర్లు మాత్రమే కార్యరూపం దాల్చాయి. శ్రీకాళహస్తి నియోజకవర్గంలో కేవలం ఒక్క బోరు మాత్రమే రైతు పొలంలో పడటం గమనార్హం.

కలవర పెడుతున్న తాజా నిబంధనలు

ఇప్పటివరకూ రైతు చేలో బోరువేశాక అక్కడ వరకూ విద్యుత్ సౌకర్యం కల్పించేందుకు అయ్యే ఖర్చు ఎంతైనా ప్రభుత్వమే భరించేంది. ఇందుకు రూ 6 లక్షల నుంచి రూ.8 లక్షల వరకూ ఖర్చు చేయాల్సిన పరిస్థితులున్నాయి. తాజా నిబంధనల మేరకు లైన్ ఏర్పాటుకు అయ్యే ఖర్చులో రూ.2 లక్షల వరకూ ప్రభుత్వం భరిస్తుందని, ఆపై ఎంత ఖర్చైనా అది లబ్ధిదారుడే భరించాలని స్పష్టం చేస్తూ ఈ మేరకు ఉన్నతాధికారులు మౌఖిక ఆదేశాలు జారీ చేశారు. గతంలో అర్హతలకు అనుగుణంగా ఎంత మంది దరఖాస్తు చేసుకున్నా పథకం వర్తింపచేసేవారు. ప్రస్తుత నిబంధన మేరకు గతేడాది ఏప్రిల్ నుంచి నియోజకవర్గానికి కేవలం 100 బోర్లనే పరిమితం చేశారు.

ఏటా కన్నీటి సాగే: గంగరాజు, రైతు, శ్రీకృష్ణాపురం



నాకు మూడెకరాల భూమి ఉంది. 20 ఏళ్లుగా సాగు చేసుకుంటున్నా. నీటి సౌకర్యం లేక ఏటా కన్నీటి సాగు చేస్తున్నా. ఈ గండం నుంచి గట్టెక్కాలని జలకళ బోరుకు దరఖాస్తు చేసుకున్నా. మూడేళ్లు గడుస్తున్నా అతీగతీ లేదు. ప్రభుత్వం వెంటనే బోర్లు వేసి పేద రైతులను ఆదుకోవాలి.



విలేకరుల సమావేశంలో అఖిలపక్షం నేతలు

సులభ్ కార్మికుల కష్టాన్ని టీటీడీ గుర్తించాలి : అఖిలపక్షం

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)

ఏళ్లతరబడి తిరుమల క్షేత్రాన్ని పరిశు భ్రంగా ఉంచడానికి అహర్నిశలు శ్రమిస్తున్న సులభ్ కార్మికుల కష్టాన్ని టిటిడి గుర్తించి వారికి తగిన జీతభత్యాలు, ఈఎస్‌ఐ, పిఎఫ్ అమలు చేయాలని అఖిలపక్ష పార్టీల నాయకులు ఉద్ఘాటించారు. తిరుపతి ప్రెస్‌క్లబ్ వేదికగా సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు, రిపబ్లిక్ పార్టీ ఆఫ్ ఇండియా దక్షిణాది రాష్ట్రాల అధ్యక్షులు పి.అంజయ్య, టిడిపి తిరుపతి పార్లమెంటు అధ్యక్షులు జి.నరసింహ యాదవ్ మాట్లాడుతూ బ్రహ్మోత్సవాల సమయంలో భక్తుల మలమూత్రాలను శుభ్రం చేసి తిరుమల పర్యావరణాన్ని కాపాడటంలో సులబ్ కార్మికుల పాత్ర ఎంతో కీలకమైనదన్నారు. ఇంతటి సేవ చేస్తున్న కార్మికుల పట్ల టిటిడి వివక్షతో వ్యవహరించడం చాలా బాధాకరమన్నారు. టీటీడీ ద్వారా కాంట్రాక్టు పొందిన కాంట్రాక్టర్ కార్మికులకు జీతభత్యాలు సరిగా ఇవ్వడం లేదన్నారు. కష్టానికి తగ్గ ఫలితం రాకపోవడంతో అధికారులకు విన్నవించి విసుగు చెందిన కార్మికులు గత ఆరు రోజులుగా తమ నిరసన గళాన్ని వినిపిస్తున్నా టీటీడీ వారి మొర వినకపోగా కార్మికులపై ఎస్మాను ప్రయోగిస్తామని బెదిరింపులకు దిగడం దారుణం అన్నారు. కలెక్టర్ జీవో ప్రకారం కనీస వేతనం 679 రూపాయలు చెల్లించాలని ఉన్నా టిటిడి 300 లోపు చెల్లించడం సహేతుకం కాదన్నారు. ధర్మాన్ని కాపాడాల్సిన వారే అధర్మబాట పట్టడం మంచిది కాదని, మే 2న తిరుపతి పర్యటనకు వస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి అయిన సులభ కార్మికుల సమస్యను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అఖిల పార్టీల నాయకులు పార్థసారధి రెడ్డి, రుద్రకోటి సదాశివం, సిపిఎం నగర కార్యదర్శి టి.సుబ్రమణ్యం, ఎమ్మెస్పీ పార్టీ జిల్లా ఇన్చార్జి నరేంద్రబాబు పాల్గొన్నారు.

అడిగిన వెంటనే రైతులకు విద్యుత్ కనెక్షన్లు : పెద్దిరెడ్డి

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

వినియోగదారులకు నాణ్యమైన, నిరంతరాయ విద్యుత్‌ను సరఫరా చేయాలని రాష్ట్ర ఇంధన శాఖామాత్యులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి విద్యుత్ శాఖాధికారులను ఆదేశించారు. తిరుపతి కలెక్టరేట్‌లో శుక్రవారం ఉదయం ఎస్‌పిడిసిఎల్, ఎపి ట్రాన్స్‌కో ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో విద్యుత్ సరఫరా వ్యవస్థ మెరుగుపడడంతో వినియోగదారులకు మెరుగైన విద్యుత్‌ను సరఫరా చేసేందుకు అవకాశం ఏర్పడిందన్నారు. రైతులు అడిగిన వెంటనే విద్యుత్ సర్వీసులను మంజూరు చేయాలని ఆదేశించారు. జగనన్న కాలనీల విద్యుదీకరణ పనులు భేషుగ్గా ఉన్నాయని పేర్కొన్నారు. సంస్థ పరిధిలో సబ్-స్టేషన్ల నిర్మాణాన్ని వేగవంతం చేయాలన్నారు. డిస్కమ్ పరిధిలో తరచూ విద్యుత్ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని, వాటిని పూర్తి స్థాయిలో అరికట్టేందుకు తక్షణ చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. విద్యుత్ బకాయిల వసూళ్ళకు ప్రాధాన్యతనివ్వాలన్నారు. అనంతరం ఎపిట్రాన్స్ కో డైరెక్టర్ భాస్కర్ రావు మాట్లాడుతూ విద్యుత్ సరఫరా కోసం ఏర్పాటు చేసే టవర్ల నిర్మాణానికి కొన్నిచోట్ల ఆటంకాలు ఎదురవుతున్నాయనే అంశాన్ని మంత్రివర్యుల దష్టికి తీసుకురావడంతో వాటిని పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సమావేశంలో ఎపిఎస్పిడిసిఎల్ డైరెక్టర్లు వి.ఎన్. బాబు, ఎన్.వి.ఎస్. సుబ్బరాజు, కె. శివప్రసాద రెడ్డి, చీఫ్ జనరల్ మేనేజర్లు డి.ఎస్. వరకుమార్, వై. లక్ష్మీ నరసయ్య, డి.వి. చలపతి. పి. ఆయూబ్ ఖాన్. కె. గురవయ్య, కె.ఆర్.ఎస్. ధర్మజ్ఞాని, ఓఎస్ డి ఎన్. శ్రీనివాసులు, ఎపిట్రాన్స్ కో చీఫ్ ఇంజనీర్ రమణ తదితరులు పాల్గొన్నారు.

టీటీడీకి 2500 స్మార్ట్ మీటర్ల విరాళం

తిరుమల: టీటీడీ అవసరాలకు ఉపయోగించడం కోసం ఐ బాట్ ఎనర్జీ ఇండియా సిస్టమ్స్ లిమిటెడ్ సంస్థ 2500 విద్యుత్ స్మార్ట్ మీటర్లను విరాళంగా అందించింది. కర్నూలుకు చెందిన ఆ సంస్థ సిఈవో శ్రీధర్ రెడ్డి శుక్రవారం తిరుమలలో టీటీడీ చైర్మన్ వైవి సుబ్బారెడ్డికి మీటర్లను అందజేశారు. వీటి విలువ రూ 2 కోట్లు ఉంటుందని దాత తెలిపారు.

వేద పరిరక్షణకు టిటిడి విశేష కృషి

వర్సిటీ స్నాతకోత్సవంలో గవర్నర్ అబ్దుల్ నజీర్

ప్రజాశక్తి - క్యాంపస్

వేదాలు విజ్ఞాన భాండాగారాలని, ఆధునిక మానవ సమాజం శాంతి సౌఖ్యాలతో జీవించడానికి వీటిలోని అంశాలు ఎంతగానో దోహదపడతాయని గవర్నర్, ఎస్వీ వేద విశ్వ విద్యాలయం కులపతి ఎస్.అబ్దుల్ నజీర్ ఉద్ఘాటించారు. వేద పరిరక్షణకు టిటిడి చేస్తున్న విశేష కృషిని అభినందించారు. శ్రీ వేంకటేశ్వర వేద విశ్వ విద్యాలయం ఏడో స్నాతకోత్సవం మహతి కళాక్షేత్రంలో శుక్రవారం ఘనంగా జరిగింది. గవర్నర్ మాట్లాడుతూ భారతీయులకు పూర్వీకుల నుంచి వారసత్వంగా వేదాలు అందాయని, ప్రపంచవ్యాప్తంగా వీటిని వ్యాప్తి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. వేదాల్లో ఆధ్యాత్మిక జ్ఞానంతో పాటు సాంకేతిక పరిజ్ఞానం దాగి ఉందన్నారు. వేద విద్యలో ఉత్తీర్ణులైన విద్యార్థులు సమాజానికి దశ-దిశ నిర్దేశం చేయాలన్నారు. భాస్కరుని గణితశాస్త్రం, ధన్వంతరి వైద్యశాతం, విరాట సంహీత, భరద్వాజ విమానశాస్త్రం, కౌటిల్యుని అర్థశాస్త్రాలు వీటిని నిదర్శనంగా నిలుస్తున్నాయన్నారు. అంతటి గొప్ప సంస్కృతి, సంప్రదాయాలను వేద విద్య అందించిందని తెలియజేశారు. ప్రాచీన తాళపత్ర గ్రంథాలను డిజిటలైజ్ చేయడం ద్వారా మన విజ్ఞాన సంపదను భావితరాలకు అందించేందుకు టిటిడి కృషి చేస్తోందన్నారు. ఇందులో భాగంగా దాదాపు మూడువేల తాళపత్రాలను డిజిటలైజ్ చేయడం గొప్ప విషయమన్నారు. సంస్కతం భారతీయ భాషలన్నింటికీ తల్లి లాంటిదని ఆయన చెప్పారు. ప్రాచీన గ్రంథాలలో చెప్పిన విధంగా ప్రకతి వ్యవసాయం ప్రాముఖ్యతను నేటి తరానికి తెలియజేసి, రైతులను ఆ దిశగా నడిపించాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఆయన అన్నారు. పురుగుమందులు వాడకుండా ప్రజల ఆహార అవసరాలను తీర్చే



సాగును ప్రాచీన గ్రంథాలు మనకు అందించాయన్నారు. ఎస్వీ వేద వర్సిటీ వైస్ చాన్సలర్ ఆచార్య రాణి సదాశివ మూర్తి మాట్లాడుతూ వేద విద్య వ్యాప్తికి చేస్తున్న కషిని, వర్సిటీ ప్రగతిని తెలియజేశారు. వేద విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులకు రూ.ఒక లక్ష నుండి రూ.4 లక్షల వరకు ప్రోత్సాహకాలు అందిస్తున్నామని తెలిపారు. టీటీడీ ఈవో ఎవి ధర్మారెడ్డి మాట్లాడుతూ, వేద విద్య పూర్తి చేసిన విద్యార్థులు ధర్మ ప్రచారం, సత్య నిష్ఠ కు బ్రాండ్ అంబాసిడర్లుగా పని చేయాలని కోరారు.

పురస్కారాలు ప్రదానం

హైదరాబాద్‌కు చెందిన వేదపండితుడు బ్రహ్మశ్రీ వి.సుబ్రహ్మణ్య శాస్త్రి సలక్షణ ఘనాపాఠి, చెన్నైకి చెందిన బ్రహ్మశ్రీ ఆర్.మణి ద్రావిడ శాస్త్రికి మహామహోపాధ్యాయ పురస్కారం గవర్నర్ చేతుల మీదుగా ప్రదానం చేశారు. అన్నవరానికి చెందిన బ్రహ్మశ్రీ కె.రామ సోమయాజి శాస్త్రి, మైసూరుకు చెందిన బ్రహ్మశ్రీ సి.వంశీ కష్ణ ఘనాపాఠి కి వాచస్పతి పురస్కారాలను గవర్నరు అందజేశారు. స్నాతకోత్సవంలో 390 మందికి బ్యాచిలర్స్ డిగ్రీ, 125 మందికి మాస్టర్ డిగ్రీ, 8 మందికి ఎంఫిల్, 16 మంది విద్యార్థులకు పిహెచ్‌డి పట్టాలు ప్రదానం చేశారు. జాతీయస్థాయిలో క్రీడలు, సాంస్కతిక అంశాలు, పరిశోధనాపత్రాలు పొంది ఉత్తమ ప్రదర్శన కనబరిచిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేశారు. అనంతరం గవర్నర్ అబ్దుల్ నజీర్ ను టీటీడీ ఈవో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో టీటీడీ జేఈవో సదా భార్గవి, డిఈవో భాస్కర్ రెడ్డి, విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ రాధే శ్యాం, విశ్వవిద్యాలయం ఈసి సభ్యులు ఆచార్య హరే కష్ణ శతపతి, డీన్ ఆచార్య ఫణి యాజులు, పిఆర్వో ఆచార్య బ్రహ్మాచార్యులు పాల్గొన్నారు.

రేణిగుంటలో గవర్నర్ కు ఘన స్వాగతం

రేణిగుంట : రెండు రోజుల తిరుమల తిరుపతి పర్యటనలో భాగంగా శ్రీ వెంకటేశ్వర వేదిక్ యూనివర్సిటీ ఏడో స్నాతకోత్సవకార్యక్రమంలో పాల్గొనుటకు, తిరుమల శ్రీవారిని కుటుంబ సమేతంగా దర్శనం చేసుకునే నేపథ్యంలో శుక్రవారం ఉదయం 9 గంటలకు రేణిగుంట విమానాశ్రయం చేరుకున్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ కి ఘన స్వాగతం లభించింది. ఆయనతోపాటు ఆం.ప్ర గవర్నర్ ప్రధాన కార్యదర్శి అనిల్ కుమార్ సింఘాల్ ఉన్నారు. కలెక్టర్ కే వెంకట రమణారెడ్డి, ఎస్పీ పరమేశ్వర్ రెడ్డి, వేదిక్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ సదాశివమూర్తి, జిల్లా వక్ఫ్ బోర్డ్ చైర్మన్ సిరాజ్ భాషా ఘన స్వాగతం పలికారు. వీరితో పాటుగా లైజన్ అధికారి చెన్నయ్య, ఎయిర్పోర్ట్ డైరెక్టర్ రాజ్ కిషోర్ ఉన్నారు.

తిరుపతి దక్షిణాన కొత్త రైల్వే స్టేషన్

ముమ్మరంగా అప్‌గ్రేడేషన్ పనులు

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో


తిరుపతి దక్షిణాన కొత్త రైల్వేస్టేషన్ రూపుదిద్దుకుంటోంది.. ముమ్మరంగా అప్‌గ్రేడేషన్ పనులు జరుగుతున్నాయి. 2022, మేలో ప్రారంభించిన ఈ పనులు 2025 ఫిబ్రవరి నాటికి పూర్తి చేయాలని దక్షిణ మధ్య రైల్వే అడుగులు వేస్తోంది. ఈ ప్రాజెక్ట బేస్‌మెంట్ కోసం రూ.300 కోట్ల నిధులను కేటాయించి వెచ్చిస్తున్నారు. రైల్వే మంత్రిత్వ శాఖ ద్వారా రూపొందించిన రైల్వేస్టేషన్ల ప్రధాన అప్‌గ్రేడేషన్ ప్రతిష్టాత్మక ప్రాజెక్టుకు దక్షిణ మధ్య రైల్వే అధికార ప్రాధాన్యత కల్పించింది.

ప్రస్తుతం ఉన్న స్టేషన్ భవనానికి దక్షిణం వైపున కొత్త స్టేషన్ భవనం రాబోతుంది. జియోలాజికల్ సర్వే పూర్తి చేయడం, క్యాంపు ఆఫీసు ఏర్పాటు, కాంక్రీట్ ల్యాబ్, స్టోరేజి షెడ్లు, రాబోయే స్టేషన్ బిల్డింగ్ కోసం పునాదుల పనులు ఇప్పటివరకూ పూర్తయ్యాయి. బేస్మెంట్ ఫ్లోర్ కాస్టింగ్ వందశాతం పూర్తయ్యింది. మిగిలిన పనులు వేగంగా జరుగుతున్నాయి. ఫౌండేషన్, బేస్‌మెంట్ ఫ్లోర్‌లోని కాలమ్స్, ఎయిర్‌కాన్కోర్స్ పనులకు దాదాపు 11.905 క్యూబిక్ మీటర్ల కాంక్రీట్ ఉపయోగించారు. గ్రౌండ్ ఫ్లోర్ నుంచి రెండో అంతస్తు వరకూ పిల్లర్ల నిర్మాణం పనులు పురోగతిలో ఉన్నాయి. ప్లాట్‌ఫారాలు, 4,5, 6లో ఎయిర్ కాన్కోర్స్ ఫౌండేషన్ల కాస్టింగ్ పనులు 90శాతం పూర్తయ్యాయి. ప్లాట్‌ఫారమ్ ఒకటిలోనూ ఇదే పని కోసం పనులు వేగంగా జరుగుతున్నాయి. రోజుకు 24 లక్షల లీటర్ల సామర్థ్యం గల మురుగునీటి శుద్ధి ప్లాంట్ నిర్మాణం కోసం తవ్వకం పనులు పూర్తయ్యాయి. పునాదుల పనులు 30శాతం పూర్తయ్యాయి. 2,300 మెట్రిక్ టన్నుల రీన్‌ఫోర్స్‌మెంట్ స్టీల్‌ను పునాదులు, రిటైనింగ్ గోడలు, బేస్‌మెంట్ రూఫ్ స్లాబ్, భూగర్భ ట్యాంక్, ఎయిర్ కన్‌కోర్స్‌లలో ఉపయోగించారు.

నిరంతరం పనులు పర్యవేక్షణ : అరుణ్‌కుమార్ జైన్, దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్



స్టేషన్ అప్‌గ్రేడేషన్ కోసం జరుగుతున్న పనులను నిరంతరం పర్యవేక్షిస్తున్నాం. పనులు బాగా జరుగు తున్నాయి. నిర్మాణంలో మరింత అప్రమత్తంగా, జాగ్రత్తగా సిబ్బంది ఉండాలి. ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన పుణ్యక్షేత్రంగా తిరుపతి విరాజిల్లుతోంది. ఇక్కడ పనులకు ఎలాంటి ఆటంకం కలగకుండా ఎప్పటికప్పుడు అప్‌గ్రేడేషన్ పనులను పర్యవేక్షిస్తున్నాం.



పనులు జరుగుతున్న ఎలివేషన్



విద్యార్థినులకు 'మలబార్' స్కాలర్‌షిప్పులు

ప్రజాశక్తి - తిరుపతి సిటి

సామాజిక సేవా కార్యక్రమంలో భాగంగా 90 మంది విద్యార్థినులకు స్కాలర్‌షిప్పులను మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్‌వారు అందజేశారు. తిరుపతి షోరూమ్‌లో నగరం నలుమూలల నుంచి విచ్చేసిన విద్యార్థినులకు మేయర్ డాక్టర్ శిరీష చేతుల మీదుగా అందించారు. ప్రతిభ ఆధారంగా 90 మంది విద్యార్థినులను గుర్తించి ఒక్కొక్కరికి 8వేలు, 10వేల చొప్పున మొత్తం 7 లక్షల 96వేల రూపాయల మొత్తాన్ని అందించారు. రాబోయే రోజుల్లో రాష్ట్రవ్యాప్తంగా 5,500 మంది విద్యార్థినులను ఎంపిక చేసి ఇవ్వనున్నట్లు మలబార్ స్టోర్ హెడ్ రిజిష్ వెల్లడించారు. సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగా వైద్యసాయం, పేదలకు గృహ నిర్మాణ సాయం అందిస్తున్నట్లు తెలిపారు. 1993లో స్థాపించిన తమ సంస్థ ప్రపంచవ్యాప్తంగా 300 షోరూమ్‌లతో 4.51 బిలియన్ డాలర్ల వార్షిక టర్నోవర్ కలిగి ఉందని తెలిపారు.

ఎస్‌పీడీసీఎల్ నూతన చైర్మన్ సంతోష్ రావుకు అభినందనలు



క్యాంపస్ : తిరుపతి కేంద్రంగా పనిచేస్తున్న ఏపీ సదరన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ లిమిటెడ్ (ఎ న్ వీ డీ సీ ఎ ల్) నూతనంగా నియమితులై రెగ్యులర్ బాధ్యతలను చేపట్టిన చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ (సీఎండీ)గా కె .సంతోష్ రావు ని కలిసి పుష్పగుచ్ఛంతో గిరిజన రాష్ట్ర అధ్యక్షులు మూడే హరి చౌహాన్ నాయక్ శుభాకాంక్షలు తెలిపారు. ఏపీ ఎస్‌పీడీసీఎల్ లో దాదాపుగా గిరిజన ఉద్యోగులు సంఖ్య, బ్యాక్లాగ్ పోస్టులను గతంలో ఖాళీలు ఉన్నటువంటివి ఇప్పుడు గిరిజనులకే కేటాయించాలని కోరారు. బ్యాక్ లాగ్ పోస్టులు భర్తీ చేయాలని చెప్పామన్నారు. ఈ కార్యక్రమంలో గిరిజన నాయకులు మధుకర్ నాయక్ మరియు వెంకటేష్ నాయక్ చంద్రశేఖర్ నాయక్, సౌందర్య నాయక్, వినోద్ నాయక్, మధు పాల్గొన్నారు.

కొట్టికొట్టి.. చేతులు నొప్పి..!



12 గంటలు పనిచేస్తే రూ.250 కూలి
చింతపండు మహిళా కార్మికుల వెట్టిచాకిరీ

ప్రజాశక్తి - పుంగనూరు

పుంగనూరు పట్టణంలో చింతపండు మహిళా కార్మికుల వెట్టిచాకిరీ దారుణంగా ఉంది.. ఏళ్ల తరబడి చింతపండు కొట్టడంలోనే వీరు మగ్గిపోతున్నారు.. రోజుకు 12 గంటలు పనిచేసినా వారికి వచ్చే కూలి కేవలం రూ.200 నుంచి రూ.250 మాత్రమే. గతంలో సిఐటియు ఆధ్వర్యంలో పోరాటం చేసిన సందర్భంగా కొంత కూలి పెంచుకోగలిగారు. ఇక్కడ పనిచేసే మహిళా కార్మికులు దీర్ఘకాలికంగా నడుము నొప్పి, కాళ్లనొప్పితో ఇబ్బందులు పడుతున్నా ఇఎస్‌ఐ, పిఎఫ్ లాంటివేవీ వీరికి వర్తించవు.

పుంగనూరు పట్టణం చింతపండు వ్యాపారానికి పెట్టింది పేరు. ఇతర రాష్ట్రాల నుంచి చింతపండును పుంగనూరుకు దిగుమతి చేసుకుని శీతలగిడ్డంగుల్లో నిల్వ ఉంచుతారు. సీజన్ ప్రారంభంలోనే చింతపండు వ్యాపారులు పక్క రాష్ట్రాల నుంచి చింతపండు కొనుగోలు చేస్తారు. ప్రధానంగా చింతపండును తుముకూరు, సిరా, అరసగిరి, మహారాష్ట్ర ,కర్ణాటక ,రాంచి, జగదల్పూర్ నుంచి దిగుమతి చేసుకుంటారు. పొట్టుకాయి తీసుకొచ్చి బండ పైన వేసి పొట్టు తీసి ఏసీలో పెడతారు. కట్టె కాయను పట్టణంలోని కుటీర పరిశ్రమ లాగా ప్రతి ఇంటిలోనూ చింతపండు పువ్వ పండు లాగా కొట్టడం జరుగుతుంది. మరి కొన్నిచోట్ల పెద్ద వ్యాపారస్తులు గోడౌన్లు లాగా పెట్టుకుని అందులో 10 నుండి 20 మంది వరకు కట్టు కాయను పువ్వ పండు లాగా కొడుతుంటారు. అక్కడ పనిచేసే మహిళా కార్మికులు ఉదయం ఇంట్లో అన్ని పనులు చూసుకుని 9 గంటలకు వస్తే రాత్రి 8 గంటలకు తిరిగి ఇంటికి వెళతారు. రోజంతా కష్టపడితే వీరికి 200 నుండి 250 రూపాయలు వరకు వస్తుంది. మహిళా కార్మికులు ఒకే చోట కూర్చోవడంతో దీర్ఘకాలిక వ్యాధులు వీరిని వేధిస్తూ ఉంటాయి. మోకాలు నొప్పులు తదితర వ్యాధులు నిరంతరం వీరిని వెంటాడుతుంటాయి. గత నాలుగు సంవత్సరాలుగా చింతపండు గిట్టుబాటు ధర లేక వ్యాపారులు ఆందోళన చెందుతున్నారు. ఈ ఏడాది సీజన్ ప్రారంభంలో వ్యాపారులు కొనుగోలు చేసినా ఎలా ఉంటుందో వ్యాపారం చెప్పలేమని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మండీలలో పనిచేసే మహిళా కార్మికులు యజమానులు వారికి 30 కేజీలు పువ్వ పండు, 20 కేజీలు కట్టే కాయను ప్రతిరోజూ ఇవ్వడం జరుగుతుంది. వీరు దీనిని శుభ్రపరచి అర్థ కేజీ చపాతి రూపంలో తయారుచేసి ప్యాకింగ్ చేస్తారు. వీరికి రోజుకు 250 రూపాయలు మాత్రమే వస్తుందని చెబుతారు. ప్రస్తుతం చింతపండు కట్టు కాయ మనువు అనగా 20 కేజీలు, కేజీ ధర 30 రూపాయలు పలుకుతుంది. ఫ్లవర్ కేజీ 60 నుండి 75 రూపాయలు, కరు పులి 100 రూపాయల నుండి 150 రూపాయలు, చపాతి 80 నుండి 100 రూపాయల వరకు ధరలు పలుకుతున్నాయి. గతంలో సిఐటియు ఆధ్వర్యంలో యూనియన్ ఏర్పాటు చేసి వారి సమస్యలపై పోరాడారు..అప్పట్లో పుంగనూరు పట్టణంలో చింతపండు కార్మికులు వేలాది మంది ఉన్నారని, వారికి గుజ్జు ఫ్యాక్టరీని ఏర్పాటు చేసి కార్మికులకు ఉపాధి అవకాశాలు కల్పించాలని ఉద్యమాలు చేపట్టారు. మహిళా కార్మికులకు ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి చికిత్సలు నిర్వహించారు.



కాయలను సుత్తితో కొడుతూ...

ఊహ తెలిసినప్పటి నుంచి ఇదే పని : డి.మచ్చమ్మ

నాకు ఊహ తెలిసినప్పటి నుంచి చింతపండు కొడుతూ జీవనం సాగిస్తున్నాను. రోజుకు దాదాపు 12 గంటల పాటు ఒకేచోట కూర్చుని పనిచేస్తుంటాం. దీంతో కాళ్లనొప్పులు విపరీతంగా ఉంటాయి. ఇంట్లో పనులు చూసుకుని ఉదయం గోడౌన్‌లో చింతపండు కొట్టడానికి వస్తే రాత్రి 8 గంటలకు తిరిగి ఇంటికి వెళతాం. రోజంతా పనిచేస్తే రూ.250 గిట్టుబాటవుతుంది. అనేకమార్లు ప్రభుత్వాలు ఆదుకుంటామని చెప్పారు. అయితే ఎలాంటి సహాయ సహకారాలు అందలేదు. మా పిల్లలు డిగ్రీలు, బిఇడి చేశారు. ప్రభుత్వం డిఎస్‌సి కూడా నిర్వహించలేదు.

తొమ్మిది నెలల పాటు పని ఉంటుంది : సరస్వతమ్మ

నలభై ఏళ్లుగా చింతపండు కొట్టి జీవనం సాగిస్తున్నాం. ఇక్కడ పని చేయడం వల్లనే మా కుటుంబ జీవనం సాగుతోంది. చింతపండు గోడౌన్‌లో ఏడాదిలో దాదాపు తొమ్మిది నెలల పాటు పనులు ఉంటాయి. వర్షాకాల సమయంలోనూ, పండగలప్పుడు పనులు ఉండవు. ఎవరెవరో వస్తారు. మా బాధలన్నీ వింటారు. అయితే ఎవరూ ఏమీ చేయడం లేదు.

పోరాటం చేసినపుడు రేటు కొంత పెరిగింది : ధనలక్ష్మి

చింతపండు మహిళా కార్మికుల కోసం సిఐటియు ఆధ్వర్యంలో యూనియన్ ఏర్పాటు చేసి వారి సమస్యల పరిష్కారానికి ఉద్యమించాం. గతంలో చపాతి రేటు తక్కువ ఇచ్చేవారు. మేం చేపట్టిన ఉద్యమంతోనే రేటు కొంతమేర పెరిగింది. పాలకులు మాత్రం చింతపండు కార్మికుల బాధలు వినడం లేదు. కార్మికులందరినీ ఐక్యం చేసి గుజ్జు ఫ్యాక్టరీ ఏర్పాటుకు ఉద్యమిస్తాం.

వేసవిలో పిల్లల ఆరోగ్యంపై ప్రత్యేక పర్యవేక్షణ



ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: వేసవి కాలంలో అంగన్వాడీ కేంద్రంలోని పిల్లలకు తరచుగా మంచినీటిని అందించాలని ఐసీడీఎస్ సూపర్వైజర్ భారతి సూచించారు. శుక్రవారం పుత్తూరు మున్సిపాలిటీ-2 సెక్టార్ పరిధిలోని సహాయకులతో పుత్తూరులోని కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ ముప్పారపు భారతి మాట్లాడుతూ వేసవికాలంలో పిల్లలకు తరచుగా మంచినీరు అందిస్తే వడ దెబ్బ తగలకుండా ఉంటారని.. ఓఆర్ఎస్ ప్యాకెట్లు ఒగన్వాడీ కేంద్రంలో అందుబాటులో ఉంచుకొని పిల్లలకు అందించాలన్నారు. మే 3 నుంచి ఆరేళ్ల పిల్లలందరూ ప్రీస్కూల్‌కు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. అందరూ తప్పక మెనూ ప్రకారం వంట చేయాలని .. పిల్లలందరికీ పౌష్టికాహారం పూర్తిస్థాయిలో అందేలా చూసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో అంగన్వాడీ సహాయకులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం



ప్రజాశక్తి-సత్యవేడు: పరిసరాల పరిశుభ్రతతోనే రోగాలు దూరమవుతాయని.. పరిశుభ్రతలో భాగంగా ఇళ్ల వద్ద మురుగునీరు నిల్వ లేకుండా చూడాలని తిరుపతి ఆరోగ్యశాఖ సబ్ యూనిట్ అధికారి శివసుబ్రహ్మణ్యం కోరారు. ప్రతి శుక్రవారం డ్రై డే కార్యక్రమాన్ని నిర్వహించాలన్నారు. సత్యవేడు పట్టణంలోని రెండో సచివాలయ పరిధిలోని గంగమెట్ట, గొల్ల వీధి తదితర ప్రాంతాల్లో డ్రైనేజీ పరిశుభ్రత, మురుగునీటిని పరిశీలించారు. ఈ సందర్భంగా సబ్ యూనిట్ అధికారి శివ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ సీజనల్ వ్యాధులైన మలేరియా, డెంగీ వంటి వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యల్లో భాగంగా ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. డ్రైనేజీ కాలువలను రోజూ శుభ్రం చేయాలని.. పంచాయతీ సిబ్బందికి సూచించారు. మురుగునీరు సజావుగా సాగకుండా అడ్డుకుంటే చర్యలు తీసుకోవాలన్నారు. రాత్రి పడుకునే ముందు దోమతెరలను వాడాలన్నారు. కార్యక్రమంలో ఏఎన్ఎం సహాయమేరి, ఆశ వర్కర్లు వెంకటలక్ష్మి, దాక్షాయని తదితరులు పాల్గొన్నారు.

మోడల్ స్కూల్ స్థలం ఆక్రమణపై వినతి



ప్రజాశక్తి-కేవీబీపురం: స్థానిక ఏపీ మోడల్ స్కూల్ స్థలానికి హద్దులు చూపాలని కోరుతూ సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు దాసరి జనార్ధన్ జిల్లా జాయింట్ కలెక్టర్ బాలాజీకి గురువారం సత్యవేడులో జరిగిన కార్యక్రమంలో వినతి పత్రాన్ని అందించారు. ఏపీ మోడల్ స్కూల్‌కు 6 ఎకరాల 50 సెంట్లు గతంలో కేటాయిస్తే స్థానికేతరులు కొందరు ఆక్రమించుకుంటున్నారని.. ప్రస్తుతం నాలుగు ఎకరాలు సైతం లేదని.. విద్యార్థులు ఆడుకోవడానికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని జేసీ దృష్టికి తీసుకెళ్లారు. తక్షణమే అధికారులు జోక్యం చేసుకొని స్కూల్ కు కేటాయించిన 6 ఎకరాల 50సెంట్ల భూమిని చూపుతూ పాఠశాల చుట్టూ ప్రహరీ ఏర్పాటు చేసి విద్యార్థులకు రక్షణ కల్పించాలని కోరారు.

డిగ్రీ కళాశాలలో నిషిధరాజు జన్మదిన వేడుకలు



ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: పట్టణంలోని హిమజ డిగ్రీ కళాశాలలో శుక్రవారం హిమజ స్కూల్, కళాశాల ఛైర్మన్ నిషిధరాజు జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. కేక్ కోసి అందరికీ పంచిపెట్టారు. ఆమెను పలువురు శాలువాలతో సత్కరించారు. జన్మదిన వేడుకలలో సురేంద్రరాజు, కుమార్తె రేష్మ, హిమజ కళాశాల యాజమాన్యం తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గ్రాడ్యుయేషన్ వేడుకలు



ప్రజాశక్తి-గూడూరు: గూడూరు పట్టణంలోని తూర్పు వీధిలో పూలతోట ప్రాంతంలో శ్రీ సరస్వతి శిశు మందిర్ పాఠశాలలో గ్రాడ్యుయేషన్ డే ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రూరల్ ఎస్సై బ్రహ్మనాయుడు మాట్లాడుతూ బాల్యం నుంచే విద్యార్థులలో నైపుణ్య విలువలు, క్రమశిక్షణ, దేశంపై గౌరవం కలిగి ఉండాలని, విద్యార్థులను ప్రోత్సహించే విధంగా గ్రాడ్యుయేషన్ డే నిర్వహించడం చాలా అభినందనీయమన్నారు. పాఠశాల కమిటీ కార్యదర్శి శ్రావణా జ్యువెలర్స్ అధినేత సేగు ప్రసాద్ మాట్లాడుతూ పాఠశాలలో ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడంతో విద్యార్థులకు విద్యాభ్యాసంలో చాలా తోడ్పాటు ఉంటుందని, విద్యార్థులకు కావాల్సింది విద్యలో ప్రోత్సాహమేనని తెలిపారు. నెల్లూరు విభాగ్ ప్రచార ప్రముఖ వేములపాటి రవి మాట్లాడుతూ శిశుమందిర్ పాఠశాలలు దేశవ్యాప్తంగా ఉన్నాయని.. వాటిలో దేశభక్తి, క్రమశిక్షణ, విద్యాభ్యాసం నేర్పిస్తూ విద్యార్థులను ఈ దేశానికి ఉపయోగపడే వ్యక్తులుగా తయారు చేస్తున్నాయని ఆయన తెలిపారు. అనంతరం విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ డే సందర్భంగా సర్టిఫికెట్లను అందించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రంగనాయకులు, ఉపాధ్యాయులు శోభ, నదియా, లక్ష్మి, తల్లిదండ్రులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

నేడు, రేపు రాష్ట్రస్థాయి జ్యోతిష్య సమ్మేళనం

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): తిరుపతి నగర పరిధిలోని ఇస్కాన్ ఆలయ మార్గంలో ఉన్న రిక్రియేషన్ హాల్లో ఈనెల 29, 30 తేదీలలో రాష్ట్రస్థాయి జ్యోతిష్య సమ్మేళనాన్ని నిర్వహిస్తున్నట్లు కంచిపేట ఆస్థాన సిద్ధాంతి విజయ సుబ్రహ్మణ్య సిద్ధాంతి తెలిపారు. శుక్రవారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జ్యోతిష్యంలో ఉన్న విశేషాలను అందరూ తెలుసుకోవాలనే ఉద్దేశంతో ఈ రాష్ట్రస్థాయి జ్యోతిష్య సమ్మేళనాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఖగోళ మార్పులు, గ్రహ స్థితులు, మానవ నిత్యజీవితంలో జ్యోతిషశాస్త్ర ఉపయోగం, వ్యవసాయం-జ్యోతిష్యం, వరుణ్ యాగం విశిష్టత వేద గణితం ఇలా అనేకం జ్యోతిష శాస్త్రాల ద్వారా మనం తెలుసుకునే అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సూర్యనారాయణమూర్తి, చక్రధర్ పాల్గొన్నారు.

కవర్లు కట్టు.. ధరలు పట్టు

● మామిడిలో చీడపీడల నివారణకు చర్యలు ● నాణ్యమైన దిగుబడులతో రైతుకు ఆదాయం ● రైతులకు ఉద్యానశాఖ అధికారిణి శివకుమారి సూచనలు



ప్రజాశక్తి-చిన్నగొట్టిగల్లు: ప్రస్తుతం మామిడి పంట దిగుబడి తక్కువగా ఉన్నందున నాణ్యత మెరుగ్గాను.. తెగుళ్లు.. మచ్చలు లేకుండా ఉంటేనే మంచి ఆదాయం పొందగలరు. ఇందుకు ఉద్యానశాఖ అధికారుల సూచనల మేరకు పలువురు రైతులు తమ పంటలను కాపాడుకునేందుకు వినూత్న ప్రయోగాలను సైతం చేపడుతున్నారు. కాయలకు కవర్లు కట్టి కాపాడుకుంటున్నారు. రైతులకు కవర్లు కట్టడంతో కలిగే ప్రయోజనాలను మామిడి రైతులకు ప్రత్యక్షంగా వివరించారు. మామిడి పండ్ల నాణ్యత, రక్షణ, మంచి దిగుబడి, ధరల కోసం ఫ్రూట్ కవర్స్ వాడకంతో ప్రస్తుతం ఎంతో అవసరమంటున్నారు. మామిడిలో కవర్ల వాడకంతో మంగు మచ్చలు, టెంక పురుగులు, పండు ఈగలు, మచ్చ తెగుళ్ల మొదలగు చీడపీడలను నియంత్రించి నాణ్యమైన పండ్ల దిగుబడిని పెంచడానికి తోడ్పడుతుంది.

కవర్లను ఎలా వాడాలంటే..!

పిందే దశలో అనగా సుమారు కోడిగుడ్డు పరిమాణంలో ఉన్నప్పుడు వాడొచ్చు. పిందెలను సంచిలో పెట్టి మూడు సెంటీమీటర్ల పైన తొడిమకు సంచికి ఉండే తీగను గాలి చొరబడకుండా కట్టాలి. 50 రోజుల తర్వాత కాయను కోసుకోవచ్చు. కవర్ల వాడకంతో మామిడికి కట్టగలిగే కవర్లు చెక్క గుజ్జుతో తయారైనపేపరు కాయకి నాణ్యతను పెంచుతుంది. ఎలాంటి క్రిమి కీటకాలు పండ్లను నాశనం చేయకుండా కాపాడుతుంది. ఎటువంటి పురుగు మందుల వాడకం అవసరం లేదు. అధిక సూర్య రశ్మి, వడగండ్ల వాన నుంచి కాయను కాపాడుతుంది. కాయ పెరగకుండా అడ్డుకునే ఉష్ణోగ్రతల నుంచి కాపాడుతుంది. ఈదురు గాలులకు, అధిక వర్షాలకు కాయలు రాలిపోకుండా ఉంటుంది. తొడిమలు దఢంగా తయారై కాయ పరిమాణాన్ని పెంచుతూ దాని సహజరంగును సమంగా విస్తరించేలా చేస్తుంది. తక్కువ కాలంలో కాయ పెరిగి అధిక దిగుబడులను ఇస్తుంది. ఎక్కువ రోజులు నిల్వ ఉండేలా చేస్తుంది. మార్కెట్లో ఇలాంటి కాయలకు అధిక ధర పలుకుతుంది. ఇలాంటి నాణ్యమైన మామిడికాయలను ఇతర దేశాలకు ఎగుమతి చేయవచ్చు. ఈ ఫ్రూట్ కవర్ల ధర మార్కెట్లో రూ.2 నుంచి రూ.2.5 వరకు ఉంటుంది. వీటిని సక్రమంగా వాడుకుంటే రెండు సార్లు ఉపయోగించవచ్చు. మామిడిలో పూత దశ నుంచి కాయ దశ వరకు అనేక రకాల క్రిమి కీటకాలు ఆశిస్తూ ఉంటాయి. దీంతో పంట దిగుబడి.. నాణ్యత దెబ్బతినే ప్రమాదం ఉంది. దీన్ని గుర్తించిన రైతులు మామిడి కాయలకు రక్షణ కవచంగా కవర్లను కట్టి మంచి ధరలను పొందేలా రైతులకు అవగాహన కల్పిస్తున్నారు.

సూచనలు పాటిస్తే నాణ్యమైన మామిడి



రైతులు పలు సూచనలు పాటిస్తేనే వేసవిలోని ఎండల తీవ్రత నుంచి మామిడి కాయలు నాణ్యతగా.. పంట దిగుబడి వస్తుంది. దిగుబడి తగ్గినా మంచి ధరలు సైతం పొందొచ్చు. కాయలకు కవర్లు కట్టడంతో తెగుళ్ల బారి నుంచి కాపాడుకోవచ్చు. కాయలు ఎంతో నాణ్యతగా ఉంటాయి.

- శివకుమారి, ఉద్యానశాఖ అధికారిణి, చిన్నగొట్టిగల్లు

బాల్య వివాహాల నిర్మూలనకు సహకారం



ప్రజాశక్తి-బుచ్చినాయుడుకండ్రిగ: బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ సహకారం అందించాలని.. చేసినా.. ప్రోత్సహించినా చట్టరీత్యా నేరమని తహశీల్దారు టీవీ సుబ్రహ్మణ్యం సూచించారు. శుక్రవారం మండలంలోని లక్ష్మీపురం ఎస్టీ కాలనీలో పౌర హక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సీ, ఎస్టీల ప్రాథమిక హక్కులపై అవగాహన కల్పించారు. అంటరానితనంపై పలు సూచనలు చేశారు. విద్యార్థులు పాఠశాలకు సక్రమంగా వెళ్లేలా తల్లిదండ్రులు పర్యవేక్షించాలన్నారు. ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో త్రివిక్రమరావు, డిప్యూటీ తహశీల్దారు శివయ్య, ఆర్ఐ వెంకటసుబ్బయ్య, ఎంపీపీ మేకల సుబ్బలక్ష్మి, సర్పంచ్ వెంకటమ్మ, హౌసింగ్ ఏఈ సుబ్రమణ్యం, మండల స్థాయి అధికారులు, సచివాలయ సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

వసతి దీవెనతో ముఖ్యమంత్రి మోసం



ప్రజాశక్తి-గూడూరు: ప్రజల్ని సీఎం జగన్మోహన్‌రెడ్డి మోసం చేస్తున్నారని.. టీడీపీ రాష్ట్ర నాయకులు అసనాపురం వెంకటేష్ అన్నారు. శుక్రవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడారు. బటన్ ముఖ్యమంత్రి వసతి దీవెన పేరుతో బటన్ నొక్కి విద్యార్థులను, విద్యార్థి తల్లితండ్రులను మోసం చేస్తున్నాడని తెలిపారు. జగన్‌మోహన్‌రెడ్డి విద్యా వ్యవస్థను, విద్యార్థుల భవిష్యత్తును సర్వ నాశనం చేశారని.. టీడీపీ హయాంలో విద్యార్థులకు ఇచ్చిన డైట్ ఛార్జెస్, కాస్మోటిక్ ఛార్జీలను తీసేసి వసతి దీవెన పేరుతో కొత్తగా ఇస్తున్నట్లు పేరు మార్చి ప్రచారం చేసుకుటున్నారన్నారు. మభ్యపెడితే నమ్మడానికి ప్రజలు అమాయకులు కాదు అనే విషయం జగన్మోహన్ రెడ్డి గుర్తుపెట్టుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు తిరుపతి పార్లమెంట్ కార్యదర్శి నవీన్ చంద్ర , తేజా యాదవ్ , పవన్, రూరల్ నాయకులు సునీల్ యాదవ్, వంశీ, నిషాంత్, అఖిల్, శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

రైతులను ఉసిగొల్పడం మంచిది కాదు : ఎంఎల్‌సి సిపాయి

ప్రజాశక్తి-తిరుపతి సిటీ: శాంతియుత రైతులను విద్యుత్ మీటర్లను ధ్వంసం చేయమని లోకేష్ లాంటి నాయకుడు పురికొల్పడం సమాజానికి మంచిది కాదని ఎంఎల్‌సి డాక్టరు సిపాయి సుబ్రమణ్యం హితవు పలికారు. టిడిపి తన అధికార దాహం తీర్చుకోవడానికి రైతులను అరాచక వాదులుగా తీర్చిదిద్ది పోలీసు కేసులలో ఇరికించాలని కుట్ర చేస్తోందని విమర్శించారు. స్థానిక ఎంఎల్‌సి కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లడుతూ 2004 ఎన్నికల ముందు టిడిపి ప్రభుత్వం మోపిన ఛార్జీలకు వ్యతిరేకంగా పోరాడిన నిరసన కారులకు బషీర్‌బాగ్ వద్ద గుర్రాలతో తొక్కించి, పోలీసులతో కాల్పించి అనేక మంది ప్రాణాలను పొట్టన పెట్టుకున్న నీచ చరిత్ర టిడిపిదన్నారు. వ్యవసాయం దండగ అన్న చంద్రబాబుకు భిన్నంగా వైఎస్ఆర్ వ్యవసాయానికి ఉచిత విద్యుత్ ఇస్తామని హామీ ఇచ్చి నిలబెట్టుకున్నారన్నారు.

క్రైస్తవ నాయకులు జాగ్రత్తగా ఉండాలి

ప్రజాశక్తి-తిరుపతి సిటీ: క్రైస్తవ నాయకులు ప్రతి విషయంలోనూ జాగ్రత్త వహించాలని ఆంధ్రప్రదేశ్ బిషప్స్ కౌన్సిల్ ఛైర్మన్ డాక్టరు ఎలమంచిలి ప్రవీణ్ సూచించారు. ఆ సంఘం జనరల్ బాడీ సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత తరుణంలో క్రైస్తవ నాయకులు అప్రమత్తంగా ఉంటూ అన్ని పరిణామాలను క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. క్రైస్తవ సోదరులు సమస్యలపై, వారికి అందుతున్న పథకాలను అందించేందుకు నిబద్ధతతో, నిజాయితీగా పని చేయాలన్నారు. బిషప్ రత్నకుమార, బాలరాజు, డేవిడ్‌రాజు, విక్టర్‌పాల్, మోజెస్, నవీన్‌కుమార్, జార్జీపాపప్, సుదర్శన్‌రావు, వర్ల ఆదాము తదితరులు పాల్గొన్నారు.

మేడేను విజయవంతం చేద్దాం..!





ప్రజాశక్తి-కేవీబీపురం: మండలంలోని అంగన్వాడీ కార్యకర్తలు, ఆశ, మధ్యాహ్న భోజన కార్మికులు, హమాలీలు, గ్రీన్ అంబాసిడర్లు, భవన నిర్మాణ కార్మికులు, వీఆర్ఏలు ఇతర అసంఘటిత కార్మికులందరూ మే ఒకటో తేదీన కేవీబీపురంలో జరిగే మేడే కార్యక్రమంలో పాల్గొని జయప్రదం చేయాలని సీఐటీయూ మండల కార్యదర్శి నాగలాపురం నాగరాజు, సిఐటియు జిల్లా కమిటీ సభ్యురాలు ఎం రాజేశ్వరి పిలుపునిచ్చారు. శుక్రవారం కొత్తూరు గ్రామంలో సిఐటియు మండల కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మికులు ఐక్యంగా పోరాటం చేసి సాధించుకున్న కార్మిక చట్టాలను నేడు నరేంద్ర మోడీ ప్రభుత్వం కార్పొరేట్ కంపెనీలకు ఊడిగం చేస్తూ నాలుగు లేబర్ కోడ్లుగా కుదిస్తూ కార్మికుల హక్కులను కాలరాస్తున్నారని నిమర్శించారు. కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని సుప్రీంకోర్టు సూచించినా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థలు గాని, ప్రైవేటు రంగ సంస్థలు గాని అమలు చేయకపోవడం దారుణమన్నారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని అత్యున్నత న్యాయస్థానం ప్రకటించినా ప్రభుత్వాలు కార్మికులపై చిన్నచూపు చూస్తున్నాయని విమర్శించారు. కార్మికులకు ఉన్న హక్కులను కాపాడుకోవాలంటే మతోన్మాద బీజేపీని సాగనంపాలన్నారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు పూర్ణమ్మ, సుజాత, శివశంకరి, సుగుణ, వరలక్ష్మి, భారతి, దేవి, వెంకటేష్, సుబ్రహ్మణ్యం, లక్ష్మయ్య, శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

సత్యవేడు: మే ఒకటో తేదీన సత్యవేడు మండల కేంద్రంలో జరిగే మేడే కార్యక్రమానికి ప్రతిఒక్క కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని సిఐటియు డివిజన్ కార్యదర్శి రమేష్ కోరారు. కార్మికులందరికీ కనీస వేతనం రూ.26 వేలు ప్రభుత్వ రంగ సంస్థలు ఇవ్వాలని డిమాండు చేశారు.

పుత్తూరు టౌన్: విశాఖపట్నం గాజువాక లంకా గ్రౌండ్స్‌లో టిఎన్‌టియూసి ఆధ్వర్యంలో జాతీయ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన జరిగే మే డే కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని చిత్తూరు పార్లమెంటరీ టిఎన్‌టియుసి అధ్యక్షులు రావిళ్ల మాధవనాయుడు కోరారు. అనంతరం మేడే కార్యక్రమ గోడ పత్రికలను ఆవిష్కరించారు. పుత్తూరు పట్టణ టీడీపీ అధ్యక్షులు గాలి జీవరత్నంనాయుడు, ప్రధాన కార్యదర్శి ఎన్ ఎన్ ధనపాల్, పుత్తూరు మున్సిపల్ మాజీ ఛైర్మన్ యుగంధర్, నాయకులు మణిరెడ్డి, జానకి రామయ్య, మస్తాన్ గుర్రప్ప, మోహన్ బాబు, వెంకటేశ్వర్లు, దేవేంద్ర, చిన్న, రవి నాయుడు, కిరణ్, శేఖర్, నజీర్, మహేష్, రాజేంద్ర, లక్ష్మయ్య హామీద్ బాషా, మోహన, నాగరత్న తదితరులు పాల్గొన్నారు.

చరిత్రకు సాక్ష్యమే.. అచ్చమ్మ అగ్రహారం పాఠశాల



ప్రజాశక్తి-పాకాల: మండలంలో అచ్చమ్మ అగ్రహారం ప్రాథమిక పాఠశాలకు ఎంతో గొప్ప చరిత్ర ఉందని.. జడ్పీటీసీ నంగా పద్మజారెడ్డి అన్నారు. అచ్చమ్మ అగ్రహారం ప్రాథమిక పాఠశాల వార్షికోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్పీటీసీ సభ్యురాలు పద్మజారెడ్డి మాట్లాడుతూ పాఠశాలలో నాడు-నేడుతో మౌలిక వసతులు మెరుగుపడ్డాయన్నారు. తాగునీటి సౌకర్యం కోసం మినరల్ ప్లాంట్ ఏర్పాటు చేయడం జరిగిందని.. విద్యాభివృద్ధికి ముఖ్యమంత్రి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారన్నారు. అధునాతన మరుగుదొడ్లు బాల బాలికలకు ఉన్నాయన్నారు. వార్షికోత్సవంలో భాగంగా విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని అలరించాయి. ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు జార్జ్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

జగనన్నకి అభివృద్ధి పథకాలే ఆశీర్వాదం



ప్రజాశక్తి-దొరవారిసత్రం: రాష్ట్ర అభివద్ధే ధ్యేయంగా పనిచేస్తున్న ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డికి ప్రభుత్వ పథకాలే శ్రీరామరక్ష అని.. మరొక్కసారి ఆశీర్వదించి అందరూ కలిసికట్టుగా పనిచేసి జగన్మోహన్ రెడ్డిని ముఖ్యమంత్రి చేయాలని సూళ్లూరుపేట నియోజకవర్గం ఎమ్మెల్యే, టీటీడీ బోర్డు సభ్యులు కిలివేటి సంజీవయ్య అన్నారు. ఆయన శుక్రవారం దొరవారిసత్రం మండల పరిధిలోని కల్లూరు, కల్లూరు కండ్రిగ మొదలగు గ్రామాలలో జరిగిన గడప గడప మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం చేసిన అభివద్ధి పనులను దష్టిలో ఉంచుకొని గ్రామ ప్రజలు అండగా ఉన్నారని..కలసికట్టుగా ఈసారి ముఖ్యమంత్రి జగనన్నను గెలిపించుకోవాలని కోరారు. ప్రభుత్వం అమలు చేసిన నవరత్నాలు అభివద్ధి పథకాల కరపత్రాలను ఇంటింటికీ అందిస్తూ ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో సూళ్లూరుపేట చెంగాలమ్మ ట్రస్ట్ బోర్డ్ ఛైర్మన్ దువ్వూరు బాలచంద్రారెడ్డి, వైసీపీ మండల అధ్యక్షులు శ్రీనివాస్‌రెడ్డి, మండల నాయకులు ప్రసాద్‌నాయుడు, బాబురెడ్డి, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, తహశీల్దారుయ గోపిరెడ్డి, ఎంపీడీవో సింగయ్య, సీఐ సోమయ్య, ఎస్సై తిరుమలరావు తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ ఫలితాల్లో సెయింట్ మేరీస్ విజయం





ప్రజాశక్తి -గూడూరు: గూడూరు రెండో పట్టణంలోని సెయింట్ మేరీస్ బాలికల జూనియర్ కళాశాల విద్యార్థినులు కార్పోరేట్ కళాశాలలకు ధీటుగా ఇంటర్ ఫలితాల్లో అత్యున్నత మార్కులు సాధించారు. టౌన్ ఫస్ట్ గా నిలిచారు. సీనియర్ ఇంటర్ ఎంపీసీ విభాగంలో 1000 మార్కులకు గాను బి.చందు ప్రియ 981 మార్కులు, బైపీసి విభాగంలో బి సంధ్య 966 మార్కులు, జూనియర్ బైపిసిలో డి.భవ్యప్రియ 470 మార్కులకు గాను 418 మార్కులు, సీఈసీలో మహిత 500 మార్కులకు 466 మార్కులు సాధించి గూడూరు టౌన్ ఫస్ట్ గా నిలిచారు. వరుసగా సీనియర్ ఇంటర్ ఎంపీసీలో చందు ప్రియ(981), యామిని(958), నిఖిత(947) మార్కులు సాధించి ప్రతిభ చాటారు. బైపీసి విభాగంలో బి.సంధ్య(966),ఎన్. సుభహాని (965), డి. ఛార్మి ప్రియ(956) మార్కులు సాధించారు. అలాగే సీనియర్ సీఈసీ లో పి తులసి(823), మీనాక్షి(822), కోమల 800 మార్కులు సాధించి టాపర్స్ గా నిలిచారు. జూనియర్ ఇంటర్ ఎంపీసీ లో ఎం.సంధ్య(442), పి శైలజ (425)హర్ష శ్రీ(421), బైపీసీలో డి.భవ్యప్రియ(418) ఏ.భవాని(409), ఎం.చంద్రిక (391), సీఈసీలో మహిత (466) అర్చన (410), అన్నపూర్ణ(398) మార్కులు సాధించి టౌన్ ఫస్ట్ గా నిలిచారు.

నేరాలు - ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



ప్రజాశక్తి-రేణిగుంట: బస్సు ఢీకొని యువకుడు మృతిచెందిన ఘటన శుక్రవారం రేణిగుంట మండలం గుత్తివారిపల్లి వద్ద జరిగింది. స్థానికుల వివరాల మేరకు.. పాతవీరాపురం గ్రామానికి చెందిన బాబ్జి (22) తన ద్విచక్ర వాహనంలో రేణిగుంట వైపు వస్తుండగా వాకాడు ఆర్టీసీ బస్సు ఢీకొంది. ప్రమాదంలో బాబ్జి అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న రేణిగుంట పట్టణ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు. మృతదేహాన్ని తిరుపతి రుయాకు తరలించారు. రేణిగుంట ఎస్సై ఈశ్వరయ్య కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గుంటలోపడి చిన్నారి మృతి

ప్రజాశక్తి-తడ: తడ మండలంలోని చేనుగుంట గిరిజన కాలనీలో మంచినీటి గుంటలో పడి మౌనిత(4) మృతి చెందింది. తుపాకుల మురళి, నాగమ్మ దంపతులకు మౌనిత, యోగేష్ ఇద్దరు సంతానం. పిల్లలను ఇంటి వద్ద నాన్నమ్మ వద్ద వదిలి పనులకు వెళ్లారు. మౌనిత ఆడుకుంటూ ఇంటి సమీపంలోని మంచి నీటి గుంటలో పడి మృతిచెందింది. కుటుంబ సభ్యులు పాప కనిపించడం లేదని వెతికి చివరకు గుంటలో చూడగా పాప అప్పటికే మృతిచెంది నీటిపై తేలుతూ కనిపించడంతో కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా రోదించారు.

బాధిత కుటుంబానికి పరామర్శ



ప్రజాశక్తి-రేణిగుంట: మండలంలోని ఎల్ల మండ్యం గ్రామ పంచాయతీ మర్రి గుంటకు చెందిన చింతల ప్రసాద్ ప్రమాదవశాత్తు మోటార్ సైకిల్ ప్రమాదంలో గాయపడి మరణించాడు. చింతల ప్రసాద్ భౌతిక కాయానికి శ్రీకాళహస్తికి చెందిన పారిశ్రామిక వేత్త జగన్నాథంనాయుడు పూలమాల వేసి నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట మద్దిలేడు మాజీ సర్పంచ్ పటాన్ ఫజురుల్లా ఖాన్, రమేష్, జగరాజు పల్లి చంద్రమౌళి నాయుడు, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

నేడు, రేపు ఎస్వీయూ స్టేడియంలో ఐపీఎల్ ఫ్యాన్ పార్క్



ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): క్రికెట్ క్రీడా ప్రేమికులకు స్టేడియంలో ఉన్నారనే ప్రత్యక్ష అనుభవాన్ని కలిగించడానికి టాటా ఐపిఎల్ ఫ్యాన్ పార్క్ ను ఏర్పాటు చేస్తున్నామని బోర్డ్ ఆఫ్ కంట్రోల్ ఫర్ క్రికెట్ ఇన్ ఇండియా(బిసిసిఐ) ఆపరేషనల్ హెడ్ సుమిత్ తెలిపారు. శుక్రవారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో టాటా ఐపిఎల్ ఫ్యాన్ పార్క్ విశిష్టతను మీడియాకు వివరించారు. ఈ సందర్భంగా సుమిత్ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా క్రికెట్ క్రీడాభిమానుల కోసం ఇప్పటివరకు 45 నగరాల్లో ఈ ఫ్యాన్ పార్క్ ను ఏర్పాటు చేసి క్రికెట్ క్రీడా ప్రేక్షకులకు వారి అభిమాన క్రీడాకారులు ఉత్తేజభరితంగా ఆడే సన్నివేశాలను కళ్ళకు కట్టినట్టుగా ఫ్యాన్ పార్క్ లో చూస్తూ ఆనందించారన్నారు. గతేడాది పుదుచ్చేరిలో నిర్వహించిన ఐపిఎల్ ఫ్యాన్ పార్క్ కు మంచి స్పందన లభించిందని, దాదాపు 20 వేల మందికి పైగా క్రికెట్ క్రీడాభిమానులు ఫ్యాన్ పార్క్ తెరవద్దా తన అభిమాన క్రీడాకారుల ఆటను చూసి అలరించారన్నారు. తిరుపతి వేదికగా నిర్వహించే టాటా ఐపిఎల్ ఫ్యాన్ పార్క్ కు పదివేల మంది వీక్షించే విధంగా అధికారులతో కలిసి ఏర్పాట్లు చేసామన్నారు. ప్రవేశం ఉచితం అయిన తిరుబండారాలకు ప్రేక్షకులే ఖర్చు చేసుకోవాలన్నారు. తమ అభిమాన క్రీడాకారుల ఆటను తిరుపతిలో ఉన్న క్రికెట్ క్రీడాభిమానులు కోసం టాటా ఐపిఎల్ ఫ్యాన్ పార్క్ ఏర్పాటు చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి చిత్తూరు జిల్లా బాయ్స్ అండ్ గర్ల్స్ క్రికెట్ అసోసియేషన్ నాయకులు మధుకర్ పాల్గొన్నారు.

'మాత్రిక' ఎగ్జిబిషన్ ప్రారంభం



ప్రజాశక్తి-తిరుపతి సిటీ: మాత్రిక డిజైనర్స్ హైదరాబాదు వారు తిరుపతిలో నూతనంగా ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్ అండ్ సేల్స్‌ను మేయరు డాక్టరు శిరీషా శుక్రవారం ప్రారంభించారు. స్థానిక కెన్సెస్ హోటల్‌లో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌లో ఆమె మాట్లాడుతూ మాత్రిక డిజైనర్స్ యాజమాన్యం వారే స్వయంగా దేశమంతా పర్యటించి, ఎక్కడెక్కడ కొత్తగా వస్తున్న డిజైన్లను గుర్తించి, వాటిని ఎగ్జిబిషన్‌లో పెడుతూ అందరి మన్ననలను పొందుతున్నారన్నారు. మాత్రిక అధినేత ఉమా మహంతి మాట్లాడుతూ కొత్తకొత్తగా పుట్టుకొస్తున్న సరైకొత్త డిజైన్లను అందరికి అందించాలనే ఉద్దేశ్యంతో ఈ ఎగ్జిబిషన్‌ను మొట్టమొదటిసారిగా తిరుపతిలో ఏర్పాటు చేశామన్నారు. ఇందులో ధనిక, పేద వంటి అన్ని వర్గాల ప్రజలకు అందుబాటు ధరల్లో కాటన్, పట్టు, ప్యాషన్ చీరలు, బ్లౌజ్‌లు, డ్రస్‌లు ఏర్పాటు చేశామని తెలిపారు. 500 రూపాయల నుంచి లక్షల రూపాయల వరకు తమ వద్ద వస్త్రాలు లభ్యమవుతాయన్నారు. 28, 29, 30 తేదీల్లో మూడు రోజుల పాటు జరిగే ఈ ఎగ్జిబిషన్ కమ్ సేల్స్‌ను తిరుపతి, పరిసరాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

చేనేతలందరూ ఐక్యంగా ఉండాలి

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): చేనేతలందరూ వారి సమస్యలు పరిష్కరించుకోవడానికి ఒక తాటిపైకి వచ్చి ప్రభుత్వానికి సమస్యలు నివేదించి పరిష్కరించే దిశగా ముందుకు రావాలని జాతీయ చేనేత ఐక్యవేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిబ్బాల వెంకట్రమణ అన్నారు. శుక్రవారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జాతీయ చేనేత ఐక్యవేదిక రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లో ఉన్న చేనేత కులాలకు చెందిన వారిని కలిసి రాష్ట్రవ్యాప్తంగా చేనేతలు ఎదుర్కొంటున్న సమస్యలు తెలుసుకున్నామన్నారు. చేనేతలకు వృత్తిపరమైన గౌరవంతో పాటు ప్రభుత్వ పరమైన ప్రోత్సాహకాలు కల్పించడానికి ఈనెల 30న తిరుపతి పద్మశాలి భవన్ లో జాతీయ జెండా ఐక్యవేదిక ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యవర్గ సమావేశం, ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు.